క్లుప్తంగా

శాస్త్రోక్తంగా ఆకాశదీపం



కార్తీక దీపాన్ని ఎగురవేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ఆకాదీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతిరోజు ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తురాలికి ఆర్థిక సాయం



యామినికి ఆర్థికసాయం అందిస్తున్న కన్నలి రమేష్

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన ఓ యువతి కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు సోమవారం శ్రీకాళహస్తి లూథరన్ చర్చి మాజీ వైస్ చైర్మన్ కన్నలి రమేష్ రూ.7 వేలు ఆర్థికసాయం అందించారు. ఎస్‌డీకేనగర్‌కు చెందిన ప్రేమ్ కుమార్, లత కుమార్తె యామిని(26) గత కొద్ది నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. పలు ఆస్పత్రులకు తిరిగినా నయం కాలేదు. దీంతో నిరంతరం డయాలసిస్ చేసుకోవాలని వైద్యులు సూచించారు. అయితే వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కావడంతో ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలిసి కన్నలి రమేష్ ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. దాతలు ముందుకు వచ్చి యామిని ఆరోగ్యం కోసం ఆర్థికసాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పనివేళల మార్పు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి



రేగంటి దేవానంద్

శ్రీకాళహస్తి: రాష్ట్ర విద్యాశాఖ పాఠశాలల పనివేళలను మార్పు చేయాలనే నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రేగంటి దేవానంద్ అన్నారు. ప్రస్తుతం అమలు అవుతున్న పనివేళలు విద్యార్థులకు అనుకూలంగా ఉన్నా, కచ్చితంగా మార్పు చేయాలన్న ఆలోచన ప్రభుత్వం ఎందుకు చేస్తుందో అర్థం కావడం లేదన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు అంటే గ్రామీణ విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. దేశంలో ఎక్కడా లేని పనివేళలు మన రాష్ట్రంలోనే అమలు చేయాలనుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం గతం కంటే ఎక్కువగా ఉందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులపై ప్రయోగాలు చేయడం సరికాదని ఆయన తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు, సర్పంచ్

సత్యవేడు: మండల కేంద్రంలోని మతంగేశ్వర స్వామి ఆలయానికి సిమెంటు రోడ్డు వసతి కల్పిస్తున్నట్లు జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి తెలిపారు. సిమెంటు రోడ్డు నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.10 లక్షలు మంజూరు కావడంతో సోమవారం స్థానిక సర్పంచ్ పి.మంజులతో కలసి జెడ్పీటీసీ సభ్యురాలు రోడ్డు పనులను ప్రారంభించారు. ప్రస్తుతం 200 మీటర్లు సిమెంటు రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఏఈ ఇబ్రహీంఖాన్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ హర్ష, గోవిందస్వామి, ఎం.కృష్ణచైతన్య, బాలరాజు, హేమయవర్మ, గౌతమి పాల్గొన్నారు.

పెండ్లిమండపం వద్ద ట్రాఫిక్‌జామ్



పెండ్లిమండంపం వద్ద బారులు తీరిన వాహనాలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పెండ్లిమండపం వద్ద సోమవారం భారీ ట్రాఫిక్‌జామ్ అయింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ మార్గం వన్‌వే కావడంతో తిరుపతి వైపు నుంచి వచ్చే వాహనాలు బస్టాండు, నెల్లూరు, నాయుడుపేట వైపు వెళ్తాయి. ఈ ప్రాంతం అత్యంత ఇరుగ్గా ఉంటుంది. ఒకేసారి వాహనాలు రావడంతో సోమవారం భారీ ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

మూణ్ణాళ్ల ముచ్చటేనా..!

- సత్యవేడు టీడీపీకి కో–ఆర్డినేటర్ శ్రీపతిబాబుకు సహకరించని తెలుగు తమ్ముళ్లు
- సిట్టింగ్ ఎమ్మెల్యే ఉండగా మీ పెత్తనమేంటని సోషల్ మీడియాలో, నేరుగా హెచ్చరికలు
- పిచ్చాటూరు మండలంలోకి రావొద్దని ఓ నేత బహిరంగంగానే ఎదురుదాడి
- కొన్ని మండలాల్లో అడుగు పెట్టొద్దని సిట్టింగ్ ఎమ్మెల్యే వర్గీయుల హుకుం
- కో–ఆర్డినేటర్ వెంట తిరిగిన వారిలో కొత్త ఆందోళన
- అధిష్టానం ఏం నిర్ణయం తీసుకుంటుందో ?



సత్యవేడులో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కో–ఆర్డినేటర్ శ్రీపతిబాబు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: సత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కో–ఆర్డినేటర్‌గా నియమితులైన శ్రీపతిబాబు పదవి మూణ్ణాళ్ల ముచ్చటే అని తేలిపోయింది. మహిళలపై లైంగిక వేధింపుల పరిణామంతో స్థానిక టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను ఆ పార్టీ అధిష్టానం రెండు నెలల క్రితం సస్పెండ్ చేసింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా సూళ్లూరుపేటకు చెందిన ఓ పారిశ్రామికవేత్త సత్యవేడులో తన ఆధిపత్యం కొనసాగించుకునేందుకు తన అనుకూల వర్గీయుడైన సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట ప్రాంతానికి చెందిన శ్రీపతిబాబుకు సత్యవేడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ బాధ్యతలను అప్పజెప్పారు. ఇటీవల ప్రభుత్వం వంద రోజులు పూర్తయిన సందర్భం, పల్లె పండుగ వంటి అధికారిక కార్యక్రమాల్లో ఆయన హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు. అయితే అదే పార్టీకి చెందిన తెలుగు తమ్ముళ్లు కొందరు ఆయన నాయకత్వానికి అడ్డుతగిలారు. దీంతో మొక్కుబడిగా కొన్ని కార్యక్రమాలకు హాజరైన శ్రీపతిబాబు, ఆ తరువాత పత్తాలేకుండా పోయాడు. సిట్టింగ్ ఎమ్మెల్యేపై సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కీలక నేతలు, ఇతర నేతలను కూడగట్టి విడతల వారీగా తమ స్వరాన్ని నియోజకవర్గంలో బలంగా వినిపించారు. అయితే కో–ఆర్డినేటర్‌గా నియమితులైన శ్రీపతిబాబును నియోజకవర్గంలో తిరిగేందుకు వీల్లేదంటూ ఆయనపై పరోక్షంగా ఎదురుదాడి చేశారు.


అడుగు పెడితే సహించం..

పిచ్చాటూరు మండలంలో నియోజకవర్గ కో–ఆర్డినేటర్ శ్రీపతిబాబుకు తెలుగు తమ్ముళ్ల నుంచి చుక్కెదురైంది. మండలానికి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే అనుచరుడు, కీలక నేత తన మండలంలో పర్యటిస్తే ఊరుకోబోమని బహిరంగంగానే ఎదురుదాడి తప్పదని సుతిమెత్తగా కో–ఆర్డినేటర్‌ను హెచ్చరించినట్లు సమాచారం. సిట్టింగ్ ఎమ్మెల్యే సొంత మండలమైన నారాయణవనం, ఇతర మండలాలు నాగలాపురం, కేవీబీపురంలో కూడ ఇదే పరిస్థితే కనిపిస్తోంది. సత్యవేడు, వరదయ్యపాళెం, బీఎస్‌కండ్రిగ మండలాల్లో సైతం శ్రీపతిబాబు పర్యటించిన సమయంలో తెలుగు తమ్ముళ్ల నుంచి పూర్తిస్థాయి సహకారం అందలేదు. ఈ పరిస్థితుల్లో పార్టీ అధిష్టానం స్పందించి చక్కబెడుతుందని ఆశపడిన శ్రీపతిబాబుకు ఆశించిన స్థాయిలో సహకారం లేకపోవడంతో పరిస్థితి తారుమారైంది.

పత్తాలేని శ్రీపతిబాబు..

అయితే ఇటీవల నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాల్లో కో–ఆర్డినేటర్ శ్రీపతిబాబు పత్తా లేకుండా పోయారు. సస్పెన్షన్‌కు గురైన సిట్టింగ్ ఎమ్మెల్యే గత కొద్దిరోజులుగా అన్ని మండలాల్లో అధికారిక కార్యక్రమాల్లో హాజరవుతున్నారు. ఈ పరిస్థితుల్లో కో–ఆర్డినేటర్ ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించడం లేదు. కనీసం ఆయనకు కో–ఆర్డినేటర్ పదవి ఉన్నట్టా? లేనట్టా ? అన్న సందిగ్ధంలో టీడీపీ సర్కిల్స్‌లో చర్చ సాగుతోంది. కొద్దిరోజుల పాటు కో–ఆర్డినేటర్‌తో కలిసి తిరిగిన కొందరు పార్టీ నేతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్యేను వదిలి పక్క నియోజకవర్గం నుంచి వచ్చిన నాయకుడితో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగిన తమ పరిస్థితి ఏంటనే డైలమాలో పడ్డారు. నాడు వ్యతిరేకించి..నేడు సిట్టింగ్ ఎమ్మెల్యేకు మనం ముఖం ఎలా చూపించాలి? అని లోలోపల మదన పడుతున్నారు. పొరబాటున సిట్టింగ్ ఎమ్మెల్యేపై సస్పెన్షన్ ఎత్తివేస్తే మన పరిస్థితి ఏమిటనే ఆందోళన కూడా వారిలో మొదలైంది. అయితే ఈ పరిణామాలన్నింటికీ ఆ పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయమే కీలకంగా మారనుంది.

హరహర మహాదేవ..







మూలవిరాట్‌కు అన్నాభిషేకం, ప్రత్యేక అలంకరణలో పాలీశ్వరస్వామి , అలంకరణలో పరశురామేశ్వరుడు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలో వెలసిన శ్రీకామాక్షీ సమేత మూలస్థానేశ్వర ఆలయంలో కార్తీకమాసంలో భాగంగా మూడవ సోమవారం రోజున విశేష అభిషేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు జువ్వల ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో తెల్లవారుజామున ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అన్నాభిషేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు 108 కలశాలతో జలాభిషేకం నిర్వహించారు. సుమారు 2 వేల మందికి పైగా భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు జువ్వల ధనుంజయరెడ్డి మాట్లాడుతూ ఏటా కార్తీకమాసంలో మూడవ సోమవారం స్వామివారి అన్నాభిషేకం ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దక్షిణామూర్తి పాల్గొన్నారు.


నారాయణవనంలో..

నారాయణవనం: మండలంలోని పాలమంగళం పాలీశ్వరస్వామి ఆలయంలో మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనలోని కైలాసనాథుడికి, కామాక్షాంబిక అమ్మవారికి అభిషేకం నిర్వహించి, బిల్వ, కుంకుమ అర్చనలు చేపట్టారు. అలాగే పరాశురేశ్వర, అగస్తీశ్వర, తుంబీశ్వర ఆలయాల్లో మూలవర్లకు అభిషేకాలు నిర్వహించారు.

గుడిమల్లంలో ప్రత్యేక పూజలు

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరాలయంలో కార్తీకమాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. మహిళలు ఆలయ ఆవరణలో నేతి దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

నయనోత్సవం.. లక్ష దీపోత్సవం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజతీర్థంలో కార్తీకమాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని లక్ష దీపోత్సవాన్ని నయనోత్సవంగా నిర్వహించారు. పుష్కరిణి ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల చిత్రపటాలకు విశేష పూజలు నిర్వహించి దీపోత్సవాన్ని చేపట్టారు. శ్రీకాళహస్తి క్షేత్రంలో తొలిసారిగా ఈ ఏడాది లక్ష దీపోత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఈఓ దంపతులు హాజరై దీపాలను వెలిగించారు.

దళితులను విభజిస్తే చంద్రబాబు పతనమే

- దళితుల మధ్య చిచ్చు పెట్టే కుట్ర
- తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ ధ్వజం



ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ చింతామోహన్

వరదయ్యపాళెం: సోదరభావంతో ఉన్న దళితుల మధ్య రాజకీయ అవసరాల కోసం వర్గీకరణ పేరుతో విభజనకు పాల్పడితే ఆ రోజు నుంచే సీఎం చంద్రబాబు పతనానికి నాంది మొదలవుతుందని తిరుపతి పార్లమెంటు మాజీ సభ్యులు చింతామోహన్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన వరదయ్యపాళెం మండలంలో పర్యటించి దుగ్గరాజపట్నం పోర్టు, మన్నవరం ఫ్యాక్టరీలను ప్రారంభించాలని ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆనాడు యునైటెడ్ యూ స్టాండ్, డివైడెడ్ యూ ఫాల్ అనే స్ఫూర్తితో దళితులు కలసి ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వ సీఎం చంద్రబాబు మాత్రం దళితులను విభజించి పాలించాలనుకోవడం ఆయన అనాగరికతకు పరాకాష్ట అని ఆరోపించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పుడల్లా దళితులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఆకలితో అలమటిస్తున్నారని, వారికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు ఇవ్వాలని కోరారు. ఏపీ విభజన చట్టంలో దుగ్గరాజపట్నం ఓడరేవు నిర్మాణానికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఉభయసభలు ఆమోద ముద్ర వేస్తే ఆ చట్టానికి వ్యతిరేకంగా చంద్రబాబు నాయుడు కేంద్రానికి లేఖ రాసి ఆపడం అన్యాయమన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ విక్రమార్క్ రెడ్డి, పార్టీ నాయకులు చందనమూడి శివ, పురుషోత్తమ్ ఉన్నారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..



రాచకండ్రిగలో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్

వరదయ్యపాళెం: మండలంలోని రాచకండ్రిగలో నెలకొన్న విద్యుత్ లోఓల్టేజీ సమస్యపై ఆ శాఖ అధికారులు స్పందించారు. స్థానికంగా ఉన్న విద్యుత్ కనెక్షన్లకు సరిపడా ట్రాన్స్‌ఫార్మర్ లేని కారణంగా తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తేవి. దీనిపై సోమవారం సాక్షిలో రాచకండ్రిగలో లోఓల్టేజీ సమస్య అని కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన నాగలాపురం ఏడీ సూచనలతో వరదయ్యపాళెం ఏఈ విజయ్ వెంకటేష్ రాచకండ్రిగలో అవసరమైన మేరకు 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం చూపారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన విద్యుత్ అధికారులను గ్రామస్తులు అభినందించారు.

జ్వరాలపై వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం

సాక్షి ఎఫెక్ట్..



వరదయ్యపాళెం: ముస్లింపాళెంలో జ్వరాలపై ఇంటింటా సర్వే

వరదయ్యపాళెం: జ్వరాలపై వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. సోమవారం సాక్షిలో సత్యవేడుకు ఫీవర్ అన్న కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా వైద్యఆరోగ్యశాఖ నియోజకవర్గంలోని 7 మండలాల్లో వైద్యాధికారులను అప్రమత్తం చేసింది. ఆ మేరకు మండలాల వారీగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో తక్షణమే ఇంటింటికీ సర్వే చేపట్టి జ్వర బాధితులను గుర్తించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. దీనిపై స్థానిక వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టి సీజనల్ వ్యాధులు, జ్వరాలపై అవగాహన కల్పించారు. అంతేకాక ఇళ్ల వద్ద పారిశుద్ధ్య ఇబ్బందులు లేకుండా శుభ్రతగా ఉంచుకోవాలని సూచనలు చేశారు. మండలంలోని ముస్లింపాళెంలో డెంగీ కేసు నమోదు కావడంతో ఆ గ్రామంలో వైద్యాధికారులు ఉదయ్‌కుమార్, ద్వైత పర్యవేక్షణలో మెడికల్ క్యాంపు నిర్వహించి స్థానికులకు వైద్యం చేపట్టారు. అలాగే చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో వైద్యులు అనిత, లావణ్య పర్యవేక్షణలో ఇంటింటా సర్వే నిర్వహించి జ్వర బాధితులను గుర్తించి వైద్యం చేపట్టారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

ఉద్యోగ మేళాలో 26 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గ్రీన్‌టెక్, పోర్ట్ మేనేజ్‌మెంట్, సర్వీసెస్, అమరరాజా పరిశ్రమలు చేపట్టిన ఉద్యోగ మేళాలో మొత్తం 26 మంది ఎంపికైనట్టు ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. అందులో తమ కళాశాలకు చెందిన 14 మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో జేకేసీ కో–ర్డినేటర్ ఉషారాణి, అధ్యాపకులు మాలతి, సుమతి, నరసింహారావు, శ్రీకాంత్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

సీపీఐ నిరసనలు



కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేయాలని రాష్ట్ర సీపీఐ పార్టీ పిలుపు మేరకు ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం వరదయ్యపాళెం మండలంలోని కాంబాకం, చిన్న పాండూరు, పెద్ద పాండూరు, వరదయ్యపాళెం–1 గ్రామ సచివాలయాల వద్ద స్థానికులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతిపత్రాలను అందజేసి అర్హత కలిగిన వారికి తక్షణమే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పిచ్చాటూరు మండలంలో..

మండలంలోని కారూరు, ఎస్‌ఎస్‌బీపేట, పులిగుండ్రం గ్రామ సచివాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతిపత్రాలు అందజేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక సచివాలయం వద్ద కూటమి ప్రభుత్వం ఎన్నికల నాటి హామీ ఇంటి పట్టాల పంపిణీ హామీని తక్షణం నెరవేర్చాలని సీపీఐ మండల కార్యదర్శి కత్తిధర్మయ్య, నాయకులు ధర్నా చేశారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు సోమవారం రాష్ట్రీయ బాల సురక్ష పథకంలో భాగంగా ఆరోగ్యంపై మండల వైద్యాధికారి దివాకర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో పలు రకాల జబ్బులు ఉన్నట్లు గుర్తించి వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించడం లేదా జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా పిల్లల్లో వెన్నెముక పుర్రె, చెవులు, ముక్కు, నోరు, గ్రహణ మొర్రి, వంకర పాదాలు, కంటి పొర, చెవుడు, రెటినోపతి, రక్తహీనత, విటమిన్ ఏ, డీ, అయోడిన్ లోపం, చర్మవ్యాధులు, చీముకారడం, గుండెవ్యాధి, పిప్పి పళ్లు, శ్వాస కోశ వ్యాధులు, మూర్ఛ వ్యాధి, చలన సమస్యలు, అభ్యసన సమస్యలు, తలసేమియా వంటి జబ్బులను గుర్తించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎంఈఓ రవీంద్రనాథ్ బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ ధర్మేంద్రసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపునకు స్పందన



పింక్ బస్సు సేవలను ప్రారంభిస్తున్న సర్పంచ్ మంజుల

సత్యవేడు: తిరుపతి స్విమ్స్, శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో మొబైల్ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. దాసుకుప్పం పీహెచ్‌సీ పరిధిలో 19న ఏఎంపురం, కన్నావరం, 21న ఆంబాకం, సత్యవేడు–2, 22న సత్యవేడు–4, కాళమనాయుడుపేట, 25న సత్యవేడు–1, శిరునంబూదూరు, 26న మదనంబేడులో క్యాంపులు నిర్వహిస్తారని డాక్టర్ ఎస్.గుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ రవి, డాక్టర్ మస్తానయ్య, ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చైతన్యభాను, డాక్టర్ హరిత, సర్పంచులు పి.మంజుల, పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్, ఏఎన్‌ఎంలు లావణ్య, సునీత, హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ వనస్థలిలో ఉన్న రాస్ కేవీకేలో సోమవారం పీఎం కుసుమ్ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలలోని వివిధ మండలాల నుంచి 32 మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత డా.ఎస్. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ రంగంలో వినియోగించే పునరుత్పాదక శక్తి వనరులలో సౌర శక్తి చాలా ముఖ్యమైనదని, రైతులు ఆ శక్తిని సాగు అవసరాల కోసం వినియోగించుకోవడంతో పాటు మిగిలిన నిల్వ శక్తిని ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు అమ్మడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. పీఎం కుసుమ్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాన్నారు. జర్మన్ ఏజెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ భానుఘనశ్యామ్ రైతులకు వివిధ సౌర విద్యుత్ శక్తి పరికరాలు, వాటి వినియోగం, ఏర్పాటుకు అయ్యే ఖర్చు, నిర్వహణ ఖర్చు, వాటి ద్వారా కలిగే లాభాలు, అదనపు ఆదాయం వంటి అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు పద్మజ, సుధాకర్, దివ్య, రాము కుమార్, అనూష పాల్గొన్నారు.

అవగాహనతోనే బాల్య వివాహాల నిర్మూలన



మాట్లాడుతున్న ప్రగతి కోఆర్డినేటర్

శ్రీకాళహస్తి రూరల్: బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలన అవగాహనతోనే సాధ్యమని ప్రగతి సంస్థ ప్రాజెక్ట్ జిల్లా కోఆర్డినేటర్ రాజారెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం వేలంపాడు, వాంపల్లి, ముచ్చువోలు గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు బాల్య వివాహాలు, బాల కార్మికులపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రగతి సంస్థ తరఫున బహుమతులు ప్రదానం చేశారు. శ్రీకాళహస్తి కోఆర్డినేటర్ ప్రభాకర్ మాట్లాడుతూ జాతీయ బాలల దినోత్సవం రోజు నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ రామచంద్ర, సోషల్ కమ్యూనిటీ ఆర్గనైజేషన్ సభ్యులు మధుకుమార్, మల్లికార్జున, వెంకటరత్నం, ఉపాధ్యాయులు, మహిళా పోలీస్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన నిలయాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుజాత



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సత్యవేడు: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.సుజాత అన్నారు. సోమవారం కళాశాలలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవరచుకోవాలని కోరారు. ఈ నెల 20న విద్యార్థులకు క్విజ్, వ్యాచరచన పోటీలు నిర్వహిస్తామన్నారు.

గ్రంథాలయాలను సందర్శించండి

నారాయణవనం: విద్యార్థులు తప్పనిసరిగా గ్రంథాలయాలను సందర్శించి, దినపత్రికలను చదవడాన్ని అలవరచుకోవాలని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సులోచన తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక గ్రంథాలయ లైబ్రేరియన్ జీవన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పట్టణ గ్రంథాలయం ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం పలువురికి గ్రంథాలయ మెంబర్‌షిప్ అందజేశారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన తపస్య స్కూల్ విద్యార్థులు

రేణిగుంట: ఇంటర్నేషనల్ గోజు ర్యో కరాటే ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన పోటీల్లో రేణిగుంట తపస్య స్కూల్ విద్యార్థులు 18మంది వివిధ బెల్ట్‌లను సాధించినట్లు స్కూల్ అధినేత విక్రమ్‌శాలి సోమవారం తెలిపారు. ఎల్లో, గ్రీన్, ఆరెంజ్ బెల్ట్‌లతో పాటు సర్టిఫికెట్లను అందుకున్న విద్యార్థులను ఆయన అభినందించారు. స్కూల్ డైరెక్టర్ అనూష పాల్గొన్నారు.

26న మహాధర్నా

రేణిగుంట(ఏర్పేడు): తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఈనెల 26న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ చేపట్టనున్న మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామిశెట్టి వెంకయ్య పిలుపునిచ్చారు. ఏర్పేడు మండలం చిందేపల్లిలో సోమవారం ఆయన మహా ధర్నాకు సంబంధించిన కరపత్రాలను రైతులతో కలసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. అందుకు నిరసనగా ఈనెల 26న దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో భారీ ఎత్తున రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలతో కలసి న్యాయమైన డిమాండ్లపై ధర్నా చేపట్టనున్నట్లు వివరించారు. రైతుల పాలిట ఉరితాడుగా మారనున్న ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసంహరించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.